క్లుప్తంగా

అహోబిలేసుని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



ఆశీర్వచనాలు అందుకుంటున్న కలెక్టర్ దంపతులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గునియా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించి వేదాశీర్వచనాలు అందుకున్నారు

లోక కల్యాణం కోసం..



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: దసరా నవరాత్రులను పురస్కరించుకొని ప్రముఖ పండితులు ఇంద్రకంటి లక్ష్మీకాంతశర్మ, యశ్వంత్‌శర్మ, శశికాంత్‌శర్మల ఆధ్వర్యంలో దొర్నిపాడులో లోకకల్యాణం కోసం గత తొమ్మిది రోజులుగా హోమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం చక్రవర్తినాయుడు, నారాయణరెడి దంపతులు చండీహోమాలు నిర్వహించారు. మహాశక్తి అమ్మవారు, వినాయక, వెంకటేశ్వరస్వాములను పూజించడం వల్ల అనుకున్న కోరికలు నెరవేరుతాయని పండితులు తెలిపారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సయ్యద్ గులాబ్

నంద్యాల(అర్బన్): వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా త్వరలో నిర్వహించే భారత్ బంద్‌లో అన్ని ముస్లిం సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గులాబ్ కోరారు. స్థానిక కార్యాలయంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఇక్బాల్‌తో కలిసి మాట్లాడుతూ జిల్లాలోని ముస్లిం యువకులు, మతపెద్దలు, భారత్‌బంద్‌లో పాల్గొనాలన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి కులమతాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరాటే మాబాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకొని సమాజ సేవలో ముందుండాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు బ్రదర్ అబ్దుల్ హఫీజ్ పేర్కొన్నారు. సోమవారం అంటికోట మసీదులో విద్యాసంస్కరణలు–అభివృద్ధి అన్న అంశంపై మేధావులు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం వల్లే చాలా మంది విద్యకు దూరమవుతున్నారని, విద్యతో పాటు ఉపాధి ఆవశ్యకత, పాఠశాలల ఏర్పాటుపై ఉమ్మడి ప్రయత్నానికి అందరూ ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరు ఉత్తమ సమాజం నిర్మాణంలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అమీర్‌షాహిద్, అబ్దుల్‌సమ్మద్, అఫీజ్‌జమాన్, అబులైజ్, నబీరసూల్, న్యాయవాది ఖాద్రి, డాక్టర్ పుర్ఖాన్ నదీమ్, అక్తర్, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా కదిరి దస్తగిరి



చాగలమర్రి: నూర్ బాష ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ముత్యాలపాడు గ్రామానికి చెందిన కదిరి దస్తగిరి నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ నూర్‌బాష ఉత్తర్వులు జారీ చేశారు. సేవలకు గుర్తింపుగా ఈ పదవి వచ్చినట్లు దస్తగిరి తెలిపారు.

బలిజల నిరసన కార్యక్రమానికి తరలిరండి

ఆళ్లగడ్డ: బలిజల్లోకి దొమ్మెరులను 'గిరి బలిజలు'గా చేరుస్తూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 5 రద్దు చేయాలని బుధవారం జిల్లా కేంద్రం నంద్యాలలో చేపట్టనున్న నిరసన సమావేశాన్ని విజయవంతం చేయాలని అహోబిలం శ్రీ కృష్ణదేవరాయ బలిజ, కాపు, తెలగ సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ మంగళవారం పిలుపునిచ్చారు. నంద్యాల ప్రథమ నంది కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి జిల్లాలోని బలిజ సంఘీయులు పార్టీలు, వర్గాలకు అతీతంగా పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. మధ్యాహ్నం ర్యాలీగా తరలి వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి నిరసన తెలుపుదామన్నారు.








సంజీవనగర్ రామాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు, మహిషాసురమర్దినిగా శ్రీకాళికాంబాదేవి, ప్రత్యేక అలంకరణలో టెక్కె సుంకులాపరమేశ్వరిదేవి, ఇంజేడులో దుర్గాదేవిగా, దొర్నిపాడు, రుద్రవరంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు

జయజయహే మహిషాసురమర్దిని

నంద్యాల(వ్యవసాయం): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దిని, దుర్గమ్మ, మహాకాళిగా అలంకరించారు. భక్తులు అభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై సందేశాలు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరిదేవి మంగళవారం రాత్రి శ్రీమహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. కుంకుమార్చన, లలిత పారాయణం, దుర్గా హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయప్ప స్వామి ఆలయం నుంచి మేయిన్ బజార్ మీదుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉయ్యాలవాడ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి మాత దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికి ఆలయాల పూజారులు విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు

రుద్రవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకా పరమే శ్వరి ఆలయం, ఎల్లావత్తుల గ్రామాల్లో మంగళవారం అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి మండపాల్లో కొలువు దీర్చారు. ఆయా గ్రామాల్లోని భక్తాదులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దొర్నిపాడు: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు మహిషాసురమర్దినిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. జయజయహే మహిషాసురమర్దిని రమ్యకపర్దిని శైలసుతే అంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్యసంఘం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



బాలాజీ కాంప్లెక్స్‌లో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



చాగలమర్రిలోని అమ్మవారి శాలలో లలితపారాయణం,



ఆకట్టుకున్న కళాకారుల వేషధారణ



శిరివెళ్లలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు



దొర్నిపాడులో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

అరాచకాలకు మూల్యం తప్పదు

శిరివెళ్ల: కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పేరుతో సాగిస్తున్న అరాచక పాలనకు భవిష్యత్తులో మూల్యం తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. అబ్దుల్ సలాం అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నెలల కూటమి పాలనలో ఎంతో మంది తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగాయన్నారు. పలువురిని కూటమి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందన్నారు. ఈ అరాచక పాలనకు విరుగుడుగా, కార్యకర్తల్లో మనో ధైర్యం నింపేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రవేశ పెట్టారన్నారు. ఇది కార్యకర్తలకు వజ్రాయుధంగా పనిచేస్తుందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలు, నేతలపై దాడులు చేసి ఇబ్బందులు పెట్టిన వారి పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే డిజిటల్ బుక్ ఓపెన్ చేసి వారి భరతం పట్టడం జరుగుతుందన్నారు.ఇప్పటికే కూటమి సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, త్వరలో వారే గుణపాఠం చెబుతారని చెప్పారు. ఎన్నికల హామీల అమలులో చంద్రబాబు విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చాంద్‌బాషా, బీసీ నాయకుడు పసుల ప్రతాప్, ఉప సర్పంచు ఇంతియాజ్, యువజన నాయకుడు బోరాల జాకీర్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ నూర్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుదాం



జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): మహాత్మాజ్యోతిరావుపూలేను స్ఫూర్తిగా తీసుకొని కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుదామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం మహాత్మాజ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మావతినగర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చురేపుతోందన్నారు. ప్రగతిశీల భావాలు గల మేధావులు, విద్యావంతులు, యువకులు, విద్యార్థులు, బీజేపీ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప, రాంబాబు, మహమ్మద్ రఫీ, పఠాన్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ

- ఇద్దరు మృతి.. నలుగురికి గాయాలు

నంద్యాల: పట్టణ శివారులోని రైతునగరం వద్ద మంగళవారం రాత్రి లారీ, ఆటో ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు తెలిపిన మేరకు వివరాలు.. నంద్యాల నుంచి కోవెలకుంట్ల వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను కోవెలకుంట్ల నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామానికి చెందిన కరీముల్లా(32), నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన ఈశ్వర్ (35) అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్తుండగా స్థానికులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాయపడిన వారు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బిట్‌కాయిన్ పేరుతో బురిడీ

కర్నూలు: బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మబలికి ఓ మహిళను సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్న ప్రసన్న రాణికి అపరిచితుడు ఫోన్ చేసి బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో ప్రసన్నరాణి స్పందించి అతడు చెప్పిన బ్యాంకు ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.90 వేలు జమ చేసింది. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బన్ని ఉత్సవంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: దసరా పండుగను పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ జరిగే దేవనగట్టు మాలమల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని,ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బన్ని ఉత్సవానికి 800 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసిందన్నారు. అల్లర్లకు పాల్పడటం నిప్పులు విసరడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రింగుల కర్రలతో బన్ని ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే దుష్పరిణామాలపై దేవరగట్టు చుట్టుప్రక్కల గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ కూడా చేపట్టి గతంలో ఘర్షణలకు పాల్పడ్డ వారిని, అక్రమ మద్యం రవాణా చేసినవారిని గుర్తించి 195 మందిని బైండోవర్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బన్ని ఉత్సవంలో ఫైర్, వైద్య, అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

భారీ బందోబస్తు...

ఏడుగురు డీఎస్పీలు, 50 సీఐలు, ఆర్‌ఐలు, 59 మంది ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, 95 మంది ఏఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 200 మంది సివిల్ ఏఆర్ కానిస్టేబుళ్లు, 18 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 90 మంది హోంగార్డులను బన్ని ఉత్సవం బందోబస్తు విధులకు నియమించినట్లు ఎస్పీ వెల్లడించారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రత్యేక పూజలు

గోస్పాడు: దుర్గాష్టమిని పురస్కరించుకుని మంగళవారం నంద్యాలలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ పాల్గొని దుర్గామాత చిత్రపటానికి పూలమాలలు వేసి నైవేద్యం సమర్పించారు. పూజా కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాకర్ అంకిరెడ్డి, డాక్టర్లు కాంతారావు నాయక్, భరత్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): కౌలు రైతులకు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జామలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలోని స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. కౌలు రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. చాలా మంది కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వలేదన్నారు. పంట సాగు చేసిన రైతులకు సకాలంలో యూరియా అందక అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసపురం, జూనేపల్లె, నంద్యాల, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు బోర్డులు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): తగ్గించిన జీఎస్టీపై దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌గౌస్, పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో పాతరేట్లకు వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి బోర్డులను దుకాణాల ఎదుట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో మంగళవారం చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ద్వారా హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ వర్ధనచారి, మేరీ ఓ ఆర్‌డబ్ల్యూ సిద్ధమ్మ, పీఈ రోజ తదితరులు ఎయిడ్స్ వ్యాధి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం గోస్పాడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బంది తప్పని సరిగా సమయపాలన పాటించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్నారని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. ఆసుపత్రికి అనారోగ్యంతో వచ్చే ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించడంతో పాటు వారికి అవసరమైన మందులను ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన ఒక మహిళ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ కాంతరావునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేల నుంచి విముక్తి, సీనియారిటీ ప్రకారం పదోన్నతులు, బకాయిల చెల్లింపులు చేపట్టాలంటూ నంద్యాల జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. ఈ అంశంపై మంగళవారం రాత్రి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను స్థానిక ఆయన కార్యాలయంలో కలిసి సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంక్రిమెంట్లతో పాటు ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఏఏఎస్ ఇప్లిమెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరి, నరేంద్ర, పద్మావతి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

శానిటేషన్ కార్మికుల నిరసన



ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న శానిటేషన్ కార్మికులు

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు వెంటనే పెండింగ్ బకాయి వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో శానిటేషన్ కార్మికులు నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఎదుట మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఈ అరకొర వేతనాలు కూడా సక్రమంగా అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం కార్మికుల సమస్యలపై మంత్రి ఫరూక్‌ను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఫాతిమా, చెన్నయ్య, మహేష్, కిరణ్, వెంకటేశ్వరమ్మ, సులోచన, హరిప్రియ, సునిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా యూత్ ఫెస్టివల్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హారూన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మెగా యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు బీసీఎం నిర్వాహకులు యోహాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బ్లెస్సింగ్ చిల్డ్రన్ మినిస్ట్రీ(బీసీఎం) 32వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు దైవ సేవకులు అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

ముగ్గురు సీఐలకు స్థానచలనం

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. కర్నూలు అర్బన్ తాలూకాకు ఎస్‌బీలో పనిచేస్తున్న తేజమూర్తిని నియమించి అక్కడున్న శ్రీధర్‌ను ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేశారు. అలాగే కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న చిరంజీవి ఖాళీగా ఉన్న ఎమ్మిగనూరు రూరల్ పీఎస్‌కు నియమితులయ్యారు. అక్కడున్న మధుసూదన్‌రావు నెల రోజుల క్రితం డీఎస్పీగా పదోన్నతిపై వెళ్లారు. ఇదిలాఉంటే కర్నూలు అర్బన్ తాలూకా, ఎమ్మిగనూరు రూరల్ తాలూకా పోలీస్‌స్టేషన్ల పోస్టింగుల కోసం అధికారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. శ్రీధర్‌ను కర్నూలు రెండో పట్టణ స్టేషన్‌కు, అక్కడున్న నాగరాజరావును కర్నూలు అర్బన్ తాలూకాకు నియమించేందుకు మంత్రి అంగీకరించినప్పటికీ చివరి నిమిషంలో సమీకరణలు మారి తేజమూర్తి నియమితులయ్యారని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే ఎమ్మిగనూరు రూరల్ స్టేషన్‌కు కూడా ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు పోటీ పడ్డారు. జిల్లా పోలీసు శాఖలో డీఎస్పీ హోదాలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ అధికారికి టీడీపీ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే సిఫారసు లేఖతో చిరంజీవి ఎమ్మిగనూరు రూరల్ పోస్టింగ్ దక్కించుకున్నట్లు సమాచారం.

సీనరేజ్ వసూలుకు రంగం సిద్ధం

- పలు చోట్ల మినీ కంటైనర్లు ఏర్పాటు
- దసరా తర్వాత ప్రైవేట్ సంస్థ చేతుల్లోకి..

కొలిమిగుండ్ల: పలు రకాల ఖనిజాల రవాణాకు సంబంధించి సీనరేజ్ వసూలు చేసే బాధ్యత ప్రైవేట్ సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయింది. కొద్ది రోజుల క్రితం కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సీనరేజ్ వసూళ్లకు టెండర్లు పిలవడంతో హైదరాబాద్‌కు చెందిన సుధాకర ఇన్‌ఫ్రా సంస్థ టెండర్ కైవసం చేసుకుంది. నాపరాతి గనులు, గ్రానైట్ తదితర ఖనిజాలను క్వారీల నుంచి ఎగుమతి చేసేందుకు ఇప్పటి వరకు భూగర్భ గనుల శాఖ అధికారులు రాయల్టీ వసూలు చేస్తూ వచ్చారు.

టెండర్ దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ దసరా పండుగ తర్వాత సిబ్బందిని నియమించుకుని ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాల నుంచి సీనరేజ్ వసూలు చేసేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తోంది. సిబ్బంది ఉండేందుకు ఇప్పటికే బందార్లపల్లె క్రాస్ రోడ్డులో ఉన్న రాయల్టీ చెక్‌పోస్ట్ చెంతనే మినీ కంటైనర్ ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల మండల కేంద్రం, అవుకు మండలం రామాపురం, బనగానపల్లె మండలంలోని పలుకూరు క్రాస్ రోడ్డు సమీపంలో కంటైనర్‌లు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. బేతంచెర్ల రైల్వే గేట్ సమీపంలో ఇప్పటికే ఏర్పాటు చేశారు.



బందార్లపల్లె క్రాస్ రోడ్డులో రాయల్టీ చెక్‌పోస్టు వద్ద ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన మినీ కంటైనర్

గడ్డు పరిస్థితిలో పరిశ్రమ

అన్ని రకాల ఖనిజాల కంటే బనగానపల్లె నియోజకవర్గంలోని నాపరాయి చాలా తక్కువది. ఇప్పటికే ఈ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఎగుమతులు లేక మైనింగ్ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సీనరేజ్ వసూలు ప్రైవేట్ పరం చేయడంతో యజమానులకు పాలుపోవడం లేదు. నాప, పాలీష్ రాళ్ల రవాణా చేసే సమయంలో టన్నుకు ఎంత మేర వసూలు చేస్తారనే విషయంలో ఆందోళన చెందుతున్నారు. టన్నుల ప్రకారం వసూలు చేస్తే కష్టాల్లో ఉన్న నాపరాతి పరిశ్రమ కోలుకోవడం కష్టంగా ఉంటుందని పలువురు యజమానులు పేర్కొన్నారు. వేలాది మంది కార్మికుల కుటుంబాలు ఈపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ట్రాక్టర్లకు మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలని మైనింగ్ యజమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.